సాక్షి
గుంటూరు
మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023




దుర్గమ్మ సేవలో ఐఏఎస్

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను మహారాష్ట్ర ఉప లోకాయుక్త, ఐఏఎస్ సంజయ్ భాటియా దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.00 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని పవిత్రోత్సవాలు ప్రారంభం



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలిరోజు వేదపండితులు ఉదకశాంతి, ఆలయశుద్ధి, ప్రధాన, ఉపాలయాలమూర్తులకు అభిషేకాలు, అర్చనలు కలశారాధన, అగ్ని మథనం, హోమాలు, గోపూజ నిర్వహించారు. మంగళవారం రెండోరోజు మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ తెలిపారు.

చేబ్రోలులో 36.8 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 36.8 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 0.4 మి.మీ వర్షం పడింది. సగటున 6.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 34.8 మి.మీ., పొన్నూరు 13, పెదనందిపాడు 11.8, వట్టిచెరుకూరు 8.2, గుంటూరు పశ్చిమ 5.4, గుంటూరు తూర్పు 1.8, తాడికొండ మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది.

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా రవి



నరసరావుపేట: పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.రవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ జి.శోభారాణి బదిలీపై సివిల్ సర్జన్‌గా రీజినల్ లేబొరేటరీ గుంటూరు మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు.

8వ తేదీన జాబ్ మేళా

గుంటూరు వెస్ట్: ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కాలేజీ, ప్రత్తిపాడులో మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 24 కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు అర్హులన్నారు. విద్యార్హతను బట్టి జీతం రూ.8,000 నుంచి 40 వేల వరకు ఉంటుందన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.5,800 వరకు పలికింది.

దసరా సందడి షురూ..!

విజయవాడ: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ఈ నెల 8వ తేదీన కో ఆర్డినేషన్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉత్సవాలకు ఏయే శాఖలు ఏయే ఏర్పాట్లు చేయాలనే అంశంతో పాటు ఆయా శాఖల మధ్య సమన్వయంపై చర్చిస్తారు. ఆయా శాఖల ముఖ్య అధికారులకు దుర్గగుడి దేవస్థాన అధికారులు ఇప్పటికే సమాచారం అందించారు. ఇక దసరా ఉత్సవాలకు అవసరమైన పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పనులు టెండర్ల దశకు చేరుకోగా, నాలుగైదు రోజుల్లో తుది దశకు చేరుకునే అవకాశం ఉందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించే ప్రత్యేక పూజలు, సేవల వివరాలను దేవస్థానం రెండు రోజుల కిందట విడుదల చేసింది. అమ్మవారి ఆలయం పరిసరాలతోపాటు రాజగోపురాన్ని అందంగా ముస్తాబు చేసేందుకు అవసరమైన పెయింటింగ్ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాజగోపురం వద్ద పెయింటింగ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో క్యూలైన్లు, షామియానాలు, వాటర్ ప్రూఫ్ షెడ్లు, వీఐపీల వాహనాల ఏర్పాటుకు రూ. 3.34 కోట్ల అంచనాలతో పనులకు పాలక మండలి ఆమోదం తెలిపింది.

భళిరా బడి



బడిలో 'హర్ష'ధ్వానాలు



ఈ పిల్లవాడి పేరు అమరహర్ష. ఊరు కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామం. వివిధ కారణాలతో తల్లిదండ్రులు స్కూల్‌కు పంపించలేదు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీరు సి.ఆర్.పి.మురళి. సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గోపాలకృష్ణ కలిసి హర్ష తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యం గురించి వివరించి హర్షను వల్లభాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించారు.

- ఇక పిల్లలందరూ బడి లోపలే..
- రికార్డు సృష్టించిన గుంటూరు జిల్లా
- రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం
- 100 శాతం జీఈఆర్ సాధించిన 18 మండలాలు
- ఆరవ స్థానంలో పల్నాడు, ఎనిమిదో స్థానంలో బాపట్ల...
- పల్నాడులో నాలుగు, బాపట్లలో రెండు మండలాల్లో జీఈఆర్..
- 100 శాతం సాధించేందుకు ప్రణాళిక...



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి జిల్లా యంత్రాంగం పట్టుదల తోడైంది. విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో గుంటూరు జిల్లా నిలిచింది. 18 మండలాలతోపాటు నాలుగు మున్సిపల్ పట్టణాలతో కలుపుకుంటే మొత్తం 22 మండలాలుగా పరిగణిస్తే అందులో 18 మండలాల్లో 100 శాతం జీఈఆర్‌ను గుంటూరు జిల్లా సాధించింది. గుంటూరు తర్వాత రెండోస్థానంలో ఉన్న ప్రకాశం జిల్లా కేవలం ఆరు మండలాల్లోనే జీఈఆర్ సాధించిందంటే గుంటూరు జిల్లా లక్ష్యానికి ఎంత దగ్గరగా ఉందో అర్థమవుతోంది. మన పక్కనే ఉన్న పల్నాడు జిల్లా నాలుగు మండలాలతో ఆరోస్థానంలో నిలవగా, బాపట్ల రెండు మండలాలతో ఎనిమిదో స్థానంలో నిలబడింది. 100 శాతం జీఈఆర్ సాధించిన రాష్ట్రంలోని తొలి మండలంగా తెనాలి నిలిచింది. జిల్లా వ్యాప్తంగా బడి బయట చదువుకు దూరంగా ఉన్న పిల్లలందరినీ మళ్లీ బడిబాట పట్టించడంలో జిల్లా యంత్రాంగం సఫలమైంది. దేశంలో విద్యార్థుల నమోదులో నూరుశాతం జీఈఆర్ సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి గత రెండు నెలలుగా చేసిన కృషి సత్ఫలితాలనిచ్చింది.

జూలై నుంచి ప్రత్యేక డ్రైవ్

గ్రామ/వార్డు సచివాలయాల సహకారంతో పాఠశాల విద్యాశాఖ, నూరుశాతం జీఈఆర్ సాధనకు గత జూలై మొదటివారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. 2005 సెప్టెంబరు 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాఠశాల, కళాశాలల్లో చదువుతూ ఉండాలనేది లక్ష్యం. ప్రభుత్వం ఇప్పటికే విద్యను ప్రోత్సహించడానికి నాడు–నేడు పేరుతో విద్యాలయాలను అభివృద్ధి చేస్తుండగా, అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి ప్రతిష్టాత్మక పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 100 శాతం జీఈఆర్ సాధించేందుకు వలంటీర్ నుంచి, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జూనియర్ కాలేజి అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఎంఈఓలు, డీఈఓ నుంచి కలెక్టర్ వరకూ సమన్వయంతో ముందడుగు వేశారు.

ఉద్యమంలా సమాచార సేకరణ

విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓల పర్యవేక్షణలో వలంటీర్లు, వార్డు సచివాలయ విద్యా కార్యదర్శులు ఇంటింటి సర్వేను ఒక ఉద్యమంలా చేపట్టారు. ఒక్కో సచివాలయం పరిధిలో వందలాదిమంది బడిఈడు పిల్లల సమాచారాన్ని సేకరించారు. విద్యాశాఖ వార్డు/ గ్రామ వలంటీర్లకు అందజేసిన యాప్‌లో వారి వివరాలను పొందుపరిచారు. 2005–2018 మధ్య జన్మించిన పిల్లల్లో ఎవరెవరు బడి బయట ఉన్నదీ తెలుసుకున్నారు. విద్యాశాఖ, మున్సిపాలిటీ, సంబంధిత పాఠశాలలు, కాలేజీల అధ్యాపకుల సమన్వయంతో తల్లిదండ్రులు, పిల్లలను ఒప్పించారు. పదోతరగతిలోపు వారిని వారు కోరుకున్న ప్రభుత్వ/ ప్రైవేటు పాఠశాలలకు పంపారు. స్తోమత లేని పేదింటి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అందుకు ఇష్టపడని పిల్లలను తల్లిదండ్రుల అభిమతం ప్రకారం నిర్బంధ ప్రాథమిక విద్యాచట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలకు పంపగలిగారు. ఇంటర్ ఫెయిలైన వారు, మధ్యలో మానేసిన వారిని కాలేజీ/ ఐటీఐ/ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేర్చారు. మరికొందరిని వారు కోరినట్టుగా కోచింగ్ క్లాసులకు పంపారు.

559 సచివాలయాల్లో సర్వే పూర్తి

జిల్లాలో 568 సచివాలయాలు ఉండగా, అందులో 559 సచివాలయాల పరిధిలో సర్వే పూర్తి అయ్యింది. 512 సచివాలయాల్లో వంద శాతం సాధించారు. గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్, తాడేపల్లి, ఫిరంగిపురంలో కొద్దిగా పెండింగ్‌లో ఉంది. వీటిని కూడా మంగళవారం రాత్రికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.

వలంటీర్ క్లస్టర్‌గా..

గుంటూరు జిల్లాలో ప్రతి వలంటీరును ఒక క్లస్టర్‌గా తీసుకున్నారు. జిల్లాలో 10,977 క్లస్టర్స్ ఉండగా, 3,05,279 మంది పిల్లలను సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ వలంటీర్లు 3,05,027 మంది పిల్లల్ని సర్వే చేశారు. ఇందులో రాష్ట్రంలో ఉండి ఇంటర్ పూర్తి చేయని వారి సంఖ్య 1,98,259 కాగా, ఇందులో 1,97,763 మంది విద్యార్థులు జిల్లా విద్యాశాఖ వద్ద ఉన్న డేటాలో నమోదై ఉన్నారు. ఇంకా 496 మందిని నమోదు చేయాల్సి ఉంది. తాడేపల్లిలో ఇద్దరు, గుంటూరు రూరల్‌లో 41 మంది, గుంటూరు అర్బన్‌లో 453 మంది ఇంకా ఎన్‌రోల్ కావాల్సి ఉంది. ఎక్కువ మంది బయట రాష్ట్రంలో చదువుతూ ఇక్కడ చైల్డ్ ఇన్ఫోలో కూడా నమోదై ఉండటం వల్ల కొంత సమస్య ఎదురైంది. వీరందరినీ చైల్డ్ ఇన్ఫో నుంచి తొలగించారు.

తల్లిదండ్రులు సహకరించాలి



పిల్లలు బడి బయట ఉండకూడదని, అందరూ చదువుకోవాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అందరి సహకారంతో లక్ష్యాన్ని సాధించగలిగాం. భవిష్యత్‌లో కూడా పిల్లలు డ్రాప్‌అవుట్ కాకుండా సహకరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఎవరైనా డ్రాప్‌అవుట్ అయితే వెంటనే వలంటీర్, సచివాలయ సిబ్బంది చొరవ చూపి వారిని మళ్లీ బడికి పంపేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్, గుంటూరు

శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడు–నేడు పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలని సూచించారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న గొప్ప పనుల్లో నాడు–నేడు కార్యక్రమం ప్రముఖమైనదని పేర్కొన్నారు. దీనిద్వారా గ్రామాలు, పట్టణాల్లో అత్యాధునిక విద్య, వైద్య వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఇలా అన్ని నూతన భవనాల నిర్మాణాలు త్వరలో పూర్తి చేయాలన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం కీలకం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో కీలకమైనదని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలనూ వెంటనే పరిష్కరించడంలో అధికారులు మరింత చొరవ చూపాలని పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులకు ప్రభుత్వం వెనువెంటనే బిల్లులు కూడా మంజూరు చేస్తోందని వెల్లడించారు. పనులకు అనుమతులు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. వెనువెంటనే అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించేలా చొరవ చూపాలన్నారు. అధికారులు విధుల్లో గానీ, పనుల నిర్వహణల్లో గానీ అవినీతికి తావీయకుండా పని చేయాలని మంత్రి చెప్పారు.

స్పందనకు అధికారులు హాజరు కావాల్సిందే

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశం

గుంటూరు వెస్ట్: దూర ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో ప్రజలు స్పందనకు వస్తారని, ప్రతి శాఖ నుంచి అధికారి తప్పక హాజరు కావాల్సిందేనని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని సార్లు చెప్పినా కొందరు అధికారులు స్పందనకు డుమ్మా కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ఉంటే ముందుగా తన పర్మిషన్ తీసుకోవాలని చెప్పారు. అలసత్వాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు 15 రోజులకొకసారి క్లోరినేషన్ చేయాలన్నారు. రక్షిత మంచినీరు ఫిల్టర్స్ ఎప్పటికప్పుడు అవసరం మేరకు మార్చుకోవాలన్నారు. తాగునీటిని పరీక్షలు చేసి వాటి ఫలితాలు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా 18 రకాల సంప్రదాయ చేతి వృత్తుల వారికి ఆర్థిక ప్రయోజనం ఉంటుందని, వాటి రిజిస్ట్రేషన్లు చేయించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం వచ్చిన 152 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

అమ్మఒడి రావట్లేదు

తొలి సంవత్సరం మా పిల్లలకు అమ్మఒడి పథకం వచ్చింది. ఆ తర్వాత రాలేదు. సచివాలయ సిబ్బంది స్కూలు పేరును తప్పుగా నమోదు చేశారని చెప్పారు. సిబ్బంది చేసిన తప్పునకు మేము నష్టపోతున్నాం. సమస్య పరిష్కరించండి.

– బి.బాబు, గోరంట్ల

తప్పుడు సర్టిఫికెట్‌తో పదోన్నతి

ఎంహెచ్‌ఓ కార్యాలయంలో సుధాకర్ అనే వ్యక్తి అంధుడినని తప్పుడు సదరన్ సర్టిఫికెట్‌తో పదోన్నతి పొందాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదు. అర్హులు నష్టపోతున్నారు.

– దాసు, గుంటూరు

కన్యకాపరమేశ్వరి గుడి వివాదం కొలిక్కి

- త్వరలో దేవదాయశాఖ నుంచి బయటకు
- సజ్జల రామకృష్ణారెడ్డి చొరవతో ఫలించిన భక్తుల అభీష్టం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు ఆర్.అగ్రహారంలోని వందేళ్ల చరిత్ర కలిగిన శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వివాదం త్వరలో సమసిపోనుంది. ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధి నుంచి బయటకు తీసుకురానున్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చొరవ తీసుకుని దేవదాయ శాఖ మంత్రితోనూ, దేవదాయ శాఖ కమిషనర్‌తోనూ మాట్లాడారు. గుంటూరులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. దీన్ని బయటకు తీసుకువచ్చేందుకు గతంలో చేసిన యత్నాలకు కోర్టు కేసులు అడ్డంకిగా మారాయి. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆర్యవైశ్య పెద్దలు డాక్టర్ కొణిజేటి రోశయ్య, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారి ఆలయాలు, ఆర్యవైశ్య సంఘాలు మాత్రమే స్వయంప్రతిపత్తిగా నిర్వహించుకునేలా జీఓలు ఇచ్చారు. దీనికి అనుగుణంగా గుంటూరులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానాన్ని కూడా దేవాదాయ శాఖ పరిధి నుంచి మినహాయించాలని కోరుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా తదితరులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. దేవదాయ శాఖ నుంచి ఈ గుడిని బయటకు తీసుకురావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఇప్పటి వరకూ దేవాలయానికి సంబంధించి కోర్టు కేసులు ఉండటం వల్ల దీన్ని బయటకు తేవడం సాధ్యపడలేదని, ఇప్పుడు పెద్దలందరి సమక్షంలో నిర్ణయం తీసుకుని ఏకాభిప్రాయానికి వచ్చారని సజ్జలకు వివరించారు. దీనిపై దృష్టి సారించి దేవదాయ శాఖ నుంచి బయటకు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి వెంటనే దేవదాయ శాఖ మంత్రి, దేవదాయ శాఖ కమిషనర్‌లతో మాట్లాడి అమ్మవారి ఆలయాన్ని దేవదాయ శాఖ నుంచి పూర్తిగా బయటకు తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. దీనికి వారు కూడా సానుకూలంగా స్పందించారు. త్వరలో దీనిపై ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆర్యవైశ్య సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గురుతారలు మెరిసే

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు 27 మంది

- నేడు గురుపూజోత్సవం
- గుంటూరులో పురస్కారాల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గురుపూజోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్తమ సేవలందించిన 27 మంది గురువులను జిల్లాస్థాయి పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం జాబితా విడుదల చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గుంటూరు మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న వేడుకలో పురస్కారాలు ప్రదానం చేస్తారని వివరించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధ్యక్షతన జరగనున్న సభలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొననున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- **హెచ్‌ఎం విభాగంలో:** అళహరి శివరామకృష్ణ, గ్రేడ్–2 హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, సంగం జాగర్లమూడి, తెనాలి, వడ్డేపల్లి వీరరాఘవరావు, హెచ్ ఎం, మున్సిపల్ హైస్కూల్ నిడుబ్రోలు.
- **స్కూల్ అసిస్టెంట్స్ విభాగం:** నూతలపాటి విజయలక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేషన్, జెడ్పీ హైస్కూల్ వేజెండ్ల, చేబ్రోలు మండలం, గొడవర్తి పాప, సోషల్, జెడ్పీ హైస్కూల్ నల్లపాడు, గుంటూరు రూరల్, పణిదరపు శ్రీనివాసరావు, ఫిజికల్ సైన్స్, జెడ్పీ హైస్కూల్ కొర్రపాడు, మేడికొండూరు, దివాకరుని నాగభారతి, పీజీటీ కెమిస్ట్రీ, జెడ్పీ హైస్కూల్ అంకిరెడ్డిపాలెం, గుంటూరు రూరల్, కోడె జ్ఞానప్రసాద్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ం, ఎంపీపీ స్కూల్ నల్లపాడు, గుంటూరు రూరల్, ఎండీ అన్వర్ సాధిక్, పీజీటీ ఫిజిక్స్, జెడ్పీ హైస్కూల్ కొర్నెపాడు, అలవాల శ్రీనివాసరావు, మాథ్స్, జెడ్పీ హైస్కూల్ నారాకోడూరు, కె. నరేంద్రకుమార్, పీజీటీ జువాలజీ, జెడ్పీ హై స్కూల్ ప్లస్ చినలింగాయపాలెం, కాకుమాను మండలం, ఇ.అంబరీషుడు, సోషల్, కేఎస్‌ఎం హైస్కూల్ తెనాలి, తాడివాక శ్రీదేవి, ఫిజికల్ సైన్స్, జెడ్పీహైస్కూల్, నిడమర్రు, మంగళగిరి, షేక్ అస్మతున్నీసా, తెలుగు, ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్, ఐతానగర్, తెనాలి, దాసరి నాగవేణి, తెలుగు, జెడ్పీ హైస్కూల్, కటెవరం, తెనాలి, బీఎస్ఎస్ గోపాలరావు, సోషల్, ఎస్ఎస్ఎస్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బ్రాడీపేట, గుంటూరు.
- **ఎస్జీటీ విభాగం:** సయ్యద్ అబ్దుల్ కరీం, ఎస్జీటీ ఉర్దూ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎంఎన్‌సీ, ఏటీ అగ్రహారం, గుంటూరు, బి.వేంకటేశ్వరరావు, డ్రాయింగ్ టీచర్, ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్ ఐతానగర్, తెనాలి, కె.శివ శంకర ప్రసాద్, ఎస్జీటీ, ఎంపీపీఎస్ నంబర్–10, సుబ్బారెడ్డినగర్ గుంటూరు, పి.సౌజన్య, ఎస్జీటీ, ఎస్ఎంఈఎస్, ఐఎన్ కాలనీ, తెనాలి, మోర్ల కృష్ణ, ఎస్జీటీ, ఎంపీపీ స్కూల్, గుడివాడ, తెనాలి, షేక్ నూర్జహాన్, ఎస్జీటీ ఉర్దూ, ఎంపీపీ స్కూల్, ఉర్దూ, కొల్లిపర.
- **ఆంగ్ల మాధ్యమం :** ప్రభుత్వం తొలిసారిగా నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపికైన ఐదుగురు ఇంగ్లిష్ బోధన ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ పురస్కారాలను ప్రకటించారు. వీరిలో వై.రమ, ఎస్‌కేబీపీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల, గుంటూరు, షేక్ చాందిని, జెడ్పీహైస్కూల్, బి. కోడూరు, కె.మేరీరాణి, ఎంపీపీ స్కూల్, కంద్రిక, ఎం.ఇందిర, పీఎంసీ హైస్కూల్, గుంటూరు, వి. మేరీ, ఎంపీయూ స్కూల్, వేములూరిపాడు ఉన్నారు.

చదువే కను'పాప'ల్లె



విద్యతోనే వృద్ధి సాధ్యమని నమ్ముతా. అందుకే చదువే కంటిపాపగా ముందుకు సాగుతున్నా. చిన్న నాటినుంచే టీచర్ కావాలని ఉండేది. 1983లో ఎస్‌జీటీగా తెనాలి మండలం పెదరావూరు పాఠశాలలో ఉద్యోగంలో చేరాను. జంపని, నందివెలుగు, సొమసుందరపాలెంలో పనిచేశా. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది బెల్లంకొండ, కొల్లూరు, ఈమని పాఠశాలల్లో పనిచేశా. ప్రస్తుతం నల్లపాడులో పనిచేస్తున్నా. 40 ఏళ్ళుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నా. ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు రావడం ఆనందంగా ఉంది.

– గొడవర్తి పాప, నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సోషల్ టీచర్

విద్యా'భారతి'నై..



నేను 2002లో పీజీటీగా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో ఉపాధ్యాయురాలిగా చేరాను. అనంతరం నగరం, మాచర్ల, నల్లపాడు పాఠశాలల్లో పనిచేశా. ప్రస్తుతం అంకిరెడ్డిపాలెం స్కూల్‌లో పనిచేస్తున్నాను. విద్యార్థులకు విద్యతోపాటు వారిలోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాను. ప్రస్తుతం ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దుతోంది. ఇది నాకెంతో ఆనందాన్నిచ్చింది. అవార్డు రావడం సంతోషం.

– దివాకరుని నాగభారతి, అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

'జ్ఞాన'ప్రసాద్‌లా..



నేటి విద్యార్థులే రేపటి తరంలో సమాజాభివృద్ధికి మూల స్తంభాలని నమ్ముతాను. ఆ దిశగా విద్యార్థులకు బోధన చేస్తున్నాను. జ్ఞాన ప్రసాదాన్ని పంచుతున్నా. 1989లో వేమూరు మండలం పెరవలిలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరా. అనంతరం మోతడక, పాములపాడు, గరికపాడులో పనిచేశా. 2019లో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందా. ప్రస్తుతం నల్లపాడు ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్నాను.

– కోడె జ్ఞానప్రసాద్, నల్లపాడు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు.

టీడీపీ వారికే మళ్లీ మళ్లీ కండువాలు కప్పి..

రాజుపాలెం: తెలుగుదేశం పార్టీలోని వారికే మళ్లీ మళ్లీ కండువాలు కప్పి ఆపార్టీ నాయకులు చేస్తున్న ఆర్భాటాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. టీడీపీలో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారాలు చేసి మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారంటూ దుయ్యబడుతున్నారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు షేక్ గౌసియాబేగం నాగుల్‌మీరా, బలిజేపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆలా అరుణకుమారి సుబ్బారావులను టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఆర్భాటంగా పార్టీలో చేర్చుకున్నారు. ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్లితే ఆ ఇద్దరు మాజీ ఎంపీటీసీలు గత టీడీపీ ప్రభుత హయాంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు సమక్షంలో టీడీపీలో చేరారు. నాటి నుంచి అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. కాగా గత కొన్ని రోజులుగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు పెరగడంతో టీడీపీ నేతల్లో గుబులు మొదలైంది. ఎవ్వరు పార్టీలో చేరే వారు లేక తమ పార్టీలో వారికే కండువాలు కప్పి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. సోమవారం జరిగిన మాజీ ఎంపీటీసీ చేరిక విషయమై ప్రజలందరు ముక్కుమీద వేలేసుకుంటున్నారు. ఈ విషయమై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో టీడీపీ పూర్తిగా పట్టు కోల్పోయిందన్నారు. తమ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించేందుకు తమ పార్టీల వారినే తిరిగి చేర్చుకుని ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. మండలంలోని ప్రజలందరికీ వాస్తవం తెలుసని, టీడీపీ మోసపూరిత చర్యలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.

త్వరలో ఎంసీహెచ్ బిల్డింగ్ పూర్తిచేస్తాం


పనులు పరిశీలిస్తున్న డాక్టర్ సాగిరెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పూర్వ వైద్య విద్యార్థుల సహకారంతో (జింఖానా) రూ. 86 కోట్లతో నిర్మాణం జరుగుతున్న మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని జింఖానా మాజీ ప్రెసిడెంట్, ఎంసీహెచ్ భవన కమిటీ చైర్మన్ డాక్టర్ బాబు రెడ్డి సాగిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నాటికి ఎంసీహెచ్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు అంతస్తుల నిర్మాణం జరిగిందని, ఇంకా నాలుగు అంతస్తుల నిర్మాణ పనులు జరగాల్సి ఉందన్నారు. గుంటూరు వైద్య కళాశాలలో చదువుకుని అమెరికాలో స్థిరపడిన అనేకమంది పూర్వ విద్యార్థులు మాతృసంస్థకు సహాయం చేయాలనీ రూ. 86 కోట్లతో ఎంసీహెచ్ నిర్మాణం చేపట్టామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ యం.టి.కృష్ణ బాబు, ఏపీ ఎం ఎస్ ఐ డి సి యండి మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిలను సోమవారం కలిసి చర్చించామన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

చోరీపై 'స్పందన' లేదు ఎస్పీ సాబ్!

నగరంపాలెం: ఇంట్లో జరిగిన చోరీపై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని ఒకరు... ఉద్యోగాల పేరుతో మోసగించారని మరికొందరు ఎస్పీ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) జరిగింది. అర్జీదారుల నుంచి జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆలకించారు. అనంతరం సబ్ డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సీఐలతో మొబైల్ ఫోన్, జూమ్ ద్వారా మాట్లాడారు. చట్టపరంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.


అర్జీదారుల సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

మలేషియాలో ఉద్యోగాలంటూ..

మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన వ్యక్తి సుమారు ఆరేళ్లుగా మలేషియాలో ఉంటున్నాడు. మిత్రుల ద్వారా అతను పరిచయమయ్యారు. ఈ క్రమంలో మలేషియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని అందర్నీ నమ్మించాడు. ఉద్యోగాలలో చేరాలంటే లక్షల్లో చెల్లించాల్సి వస్తోందని, గతంలోనూ పలువురికి ఇప్పించగా అక్కడ ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్హత ఆధారంగా జాబ్‌లు ఉంటాయని చెప్పగా అతని మాటలు నమ్మి, బ్యాంక్ ఖాతాకు నగదు దఫాల వారీగా పంపించాం. 45 రోజుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి, ఏళ్లు గడిచాయి. ఉద్యోగాల విషయమై అడిగితే కాలయాపన చేసేవాడు. లేకపోతే ప్రభుత్వం మారిందని త్వరలో ఇప్పిస్తానని దాట వేసేవాడు. ఫోన్లు చేస్తే మాట్లాడేవాడు కాదు. తరువాత ఇష్టానుసారంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. ఇక గుంటూరు నగరంలోని ఓ విత్తన కంపెనీకి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న అతని తండ్రిని అడిగినా సరైన సమాధానం లేదు. ఇటీవల మలేషియా వెళ్లగా ఆరేడు నెలలుగా ఖాళీగా ఉన్నట్లు, ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు అబ్దుల్ సుబాన్ తెలిపారు. గతంలో తన వద్ద రూ.20 లక్షలు తీసుకున్నాడని, సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసేందుకు మలేషియా నుంచి గుంటూరు వచ్చినట్లు పేర్కొన్నారు. దాదాపు 15 మంది బాధితులు ఉన్నారని, వీసా, ఉద్యోగాల పేరుతో సుమారు రూ.80 లక్షల వరకు తీసుకున్నాడు.

– సయ్యద్ నాగూల్‌మీరా (తెనాలి), ఖాజాబిలాన్, అబ్దుల్ సుబాన్ (తురకపాలెం), షేక్.జానీ భాషా (మేడికొండూరు), సయ్యద్ మౌలాలి. (బాధితులు)

లాటరీ వచ్చిందని..

రెండు నెలల క్రితం మొబైల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. ఓ ఫౌండేషన్ నుంచి రూ.16.11 కోట్ల లాటరీ వచ్చిందని అందులో సారాంశం. ఆ మొత్తాన్ని డ్రా చేసుకోవాలంటే కనీస చార్జీలు చెల్లించాలని ముంబాయి నుంచి కాల్ చేసి మాట్లాడారు. ఈ క్రమంలో ఆదాయపు పన్ను, కరెన్సీ చార్జింగ్, ఎన్‌ఓసీ, జీఎస్టీ, అలస్యపు జరిమానా ఇలా రకరకాల పేర్లతో సుమారు రూ.9 లక్షలు దఫాల వారీగా మొబైల్ ద్వారా చెల్లించా. చివరికి మోసం అని తెలుసుకున్నాక, అవతలి వైపు నుంచి సరైన స్పందన లేదు.

– ఏఎస్.సొహైల్, విశ్రాంత ఆర్మీ, శ్యామలానగర్ ఒకటో వీధి.

ఫిర్యాదు తీసుకోవడం లేదు

గతనెల 12 తెల్లవారుజామున ఇంట్లో దాచిన పది తులాలు విలువ చేసే బంగారంవస్తువులు, రూ. 10 వేలు, మొబైల్‌ఫోన్ చోరీకి గురైంది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. రోజులు తరబడిగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. ఇంటి దగ్గర్లోని సీసీ కెమెరాల్లో దొంగలించిన వ్యక్తి చాయచిత్రాలు నమోదయ్యాయి. అతనిపై గతంలో చోరీ కేసులున్నాయని తెలిసింది. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు.

– టి. దుర్గప్రసాద్, అరుంధతినగర్ 4/1వ అడ్డరోడ్.

నకిలీవి ఇచ్చారు

ఇటీవల అయిదెకరాల పొలంలో మొక్కజొన్న పంట వేశా. అయితే ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. నకిలీ విత్తనాలు వాడకం వల్లే దిగుబడి రాలేదని తెలియడంతో, సదరు విత్తన విక్రయదారుల వద్దకెళ్లా. ఈ విషయమై వారిని అడిగితే సరైన స్పందన లేదు.

– కోటేశ్వరరావు, ఉద్దండరాయనిపాలెం.

రేపు 'బజరంగ్' క్యాన్సర్ వైద్య శిబిరం

- 'జగన్నామ సంక్షేమ సంవత్సరంలో ప్రతి మహిళా సురక్షితం
- బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మహిళలకు క్యాన్సర్ మహమ్మారి నుంచి రక్షణ కల్పించే సదుద్దేశంతో 'జగన్నామ సంక్షేమ సంవత్సరంలో ప్రతి మహిళా సురక్షితం' అనే నినాదంతో వైద్య పరీక్షా శిబిరాన్ని బజరంగ్ చేపట్టిందని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటికే ఆరోగ్యం- జగనన్నతో సాకారం, ఆరోగ్యశ్రీతో ఆయుష్మాన్‌భవ అంటూ తాము ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించే వైద్య పరీక్షలను గుంటూరు ఒమేగా హాస్పిటల్ సహకారంతో మహిళా వైద్యుల ఆధ్వర్యంలో చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యం జగనన్న 'ఆరోగ్యశ్రీ' తోనే సాధ్యమని, వైద్య-వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి తదుపరి వైద్య సేవలకు బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. మామిళ్లపల్లి గ్రామంలో మహిళలకు అవగాహన కోసం గడప గడపకూ స్వయంగా ప్రచారం నిర్వహించారు.


పోస్టర్‌ను ఆవిష్కరించిన అంబటి మురళీకృష్ణ

గుండె సమస్యలపై అప్రమత్తత అవసరం

ప్రజలు గుండె సమస్యల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని మురళీకృష్ణ అన్నారు. దండమూడి గ్రామంలో కొద్ది రోజుల కిందట ఏర్పాటు చేసిన గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 24 మందిలో 12 మందిని ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి సోమవారం తరలించారు. అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో 8 మందికి ఆరోగ్య స్థితి మెరుగ్గానే ఉండగా, ఇద్దరికి శస్త్ర చికిత్స ఆవశ్యకత, ఇద్దరికి స్టంట్ వేయాల్సిన ఆవశ్యకత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మెడ్‌స్టార్ ఆసుపత్రిలో పేషెంట్లను అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం గుండె పదిలం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మృతుల ఓట్లు వెంటనే తొలగించండి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా ఇంటింటి సర్వేలో మరణించిన వారి ఓట్లు గుర్తించిన వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మరణించిన వారి ఓట్లు ఓటర్ల లిస్టులో కొనసాగుతున్నాయన్నారు. ఈఆర్వో, ఏఈఆర్వో, నూతన ఓటర్లకు సంబంధించి 6, 7, 8 ఫారమ్స్, వెరిఫికేషన్ తదితర అంశాలను అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఓటరు కార్డు వెరిఫికేషన్‌కు వెళ్లినప్పుడు బీఎల్వోలు ఆ ఇంటిలోని కుటుంబ సభ్యులకు ఓటరు కార్డులకు సంబంధించి అన్ని విషయాలను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు ఓటరుకు సంబంధించి వెల్లడించిన అంశాలపై అన్ని వివరాలు సేకరించుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.